సార్వా సాగుకు ప్రతికూల పరిస్థితులు



డెల్టాలోని పూళ్ల- 3 మెరక తూము వద్ద నీటి కోసం కుస్తీలు పడుతున్న రైతులు



మెట్ట ప్రాంతంలోని కోడూరుపాడులో బోర్ల కింద పొలంలో దుక్కి దున్నుతున్న రైతు

- డెల్టాలో ఊపందుకోని సాగు
- బోర్ల కింద సాగు పనులు ప్రారంభం
- వాతావరణం అనుకూలించక రైతుల గగ్గోలు
- గోదావరి కాలువలో తక్కువ నీటి ప్రవాహం



సూరప్పగూడెంలోని మడుల్లోకి చేరిన నీరు



మెట్ట ప్రాంతం దుద్దేపూడిలో ఏపుగా పెరిగిన నారుమడి

భీమడోలు: భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో ప్రతికూల పరిస్థితుల కారణంగా సార్వా పనులు మందగొడిగా సాగుతున్నాయి. గోదావరి కాలువకు నీటిని విడుదలచేసి సుమారు నెలరోజులు కావస్తున్నా నేటికీ డెల్టా ప్రాంతంలో సార్వా పనులు ఊపందుకోలేదు. బోర్ల కింద సాగు ఊపందుకోగా డెల్టా ఏరియాలో పనులు ప్రారంభమయ్యాయి. దీనితో సాగులో విభిన్న పరిస్థితులు అలుముకున్నాయి. ఓ పక్క వర్షాలు కురవకపోవడం, గోదావరి కాలువ పరిధిలోని ఆయకట్టుకు సరిపడా నీరందకపోవడం, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో సాగు పురోగతి అంతంత మాత్రంగా ఉంది. గోదావరి కాలువ వెంబడి ఉన్న పంట చేలకు నేటికి పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. దీనితో సాగు పనులు నత్తనడక సాగుతున్నాయి. ఏరువాక పౌర్ణమి సందర్భంగా మెట్ట ప్రాంతంలో రైతులు బోర్లకింద గల మెట్ట సాగు ముమ్మరంగా సాగుతుండగా డెల్టాలో పనులు ప్రారంభ దశలోఉన్నాయి. డెల్టా రైతాంగం గోదావరి నీరు, వర్షపు నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. కాలువకు నీరు వదిలి మూడు వారాలు గడుస్తున్నా మెరక ఏరియాల్లోనూ సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల ట్రాక్టర్‌తో దుక్కులు చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే నారుమడులు వేశారు. సాగు ఆలస్యమయితే పంట చేతికందే తరుణంలో భారీ వర్షాలు కురిసి నష్టాల పాలు అవుతామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలకు సంబంధించి 45,807 ఎకరాల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటికే 2,292 ఎకరాల్లో నారుమళ్లు వేయాల్సి ఉండగా ప్రస్తుతం 1,305 ఎకరాల్లో నారుమళ్లు వేశారు. ఉంగుటూరు మండలంలో 60ఎకరాల్లో నాట్లు వేయగా మిగిలిన మండలాల్లో నాట్లు వేయలేదు. ఎండ ధాటికి నారుమడులు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. భీమడోలు మండలంలో 668 ఎకరాల్లో నారుమళ్లు వేయాల్సి ఉండగా ప్రస్తుతం 370 ఎకరాల్లో, ఉంగుటూరు మండలంలో 1,185 ఎకరాల్లో నారుమళ్లు వేయాల్సిఉండగా 728ఎకరాల్లో, నిడమర్రు మండలంలో 3,563ఎకరాల్లో నారుమడి వేయాల్సిఉండగా 178 ఎకరాల్లో నారుమళ్లు వేశారు.

మండలం	సార్వా సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
భీమడోలు	13,362
ఉంగుటూరు	23,672
నిడమర్రు	3,563
ద్వారకాతిరుమల	5,210

గ్రంథాలయాలతో విజ్ఞానం వృద్ధి



పెదవేగి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పెదవేగి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రంథాలయాల్లో చేపట్టిన చదవడం మాకిష్టం అనే కార్యక్రమంతో విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవచ్చని పెదవేగి శాఖా గ్రంథాలయాధికారి తోట అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పెదవేగి సమీప ప్రాంతాల నుంచి గ్రంథాలయానికివిచ్చేసిన విద్యార్థులకు అరుణ్‌కుమార్ వివిధ రకాల విజ్ఞాన భరిత పుస్తకాలను ఇచ్చి చదివించారు. చరిత్రలో విజయాలు సాధించిన ప్రముఖుల జీవిత చరిత్రలను చిన్నారులకు వివరించి, వారిలో నూతనోత్సాహాన్నినింపారు.

న్యాయం చేయాలని వినతి

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని, రెండు వారాలుగా తాము ఆందోళన చేస్తున్నా ఇంతవరకూ యాజమాన్యం స్పందించలేదని గణపవరం సీపీఎఫ్ ఉద్యోగులు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు మొర పెట్టుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులు ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎటువంటి సమాచారం లేకుండా లాభాల్లో ఉన్న కంపెనీని అర్థాంతరంగా మూసివేసి తమను వీధుల పాలు చేశారని ఉద్యోగులు వాపోయారు. వారం రోజులుగా రాజమండ్రిలోని సీపీఎఫ్ కంపెనీ గేటు ముందు ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించడంలేదని ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఈ విషయంలో ఉద్యోగులకు న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానని, కంపెనీ బాధ్యులతో మాట్లాడతానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



ఉంగుటూరులో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న మాలతీరాణి, బీజేపీ శ్రేణులు

ఉంగుటూరు: జాతి ఐక్యత, సమగ్రత కోసం ప్రాణాలను సైతం తృణపాయంగా అర్పించిన మహోన్నతుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి అన్నారు. ఆదివారం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బొమ్మిడి, కాకర్లమూడి, ఉంగుటూరులోని శక్తి కేంద్రాల్లో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న మాలతీరాణి మాట్లాడుతూ ముఖర్జీ జీవిత విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అడపా శోభారాణి, బీజేపీ మండల అధ్యక్షుడు వంజరపు దుర్గారావు, మండల ప్రధాన కార్యదర్శి రామారావు, అడపా గణపతి, కొరిపల్లి అప్పారావు, కొప్పల శ్రీను, టీకి కొకండల రావు, టీకి వెంకటేష్, చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

5.20 లక్షల మందికి ఉపాధి పనులు



ఏపీఓ రామ్‌జీ

దెందులూరు: దెందులూరుమండలంలో 17 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు జాతీయ ఉపాధి హామీ పథకంలో 5.20 లక్షల మందికి ఉపాధి పని కల్పిస్తామని దెందులూరు మండల ఏపీఓ దశరద రామ్‌జీ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన కార్యాలయంలో మాట్లా డుతూ చెరువుల్లో మట్టి తీయడం, గట్లు పటిష్ఠ పరచడం, సప్లయ్ ఛానల్స్ ఏర్పాటు తదితర పనులు ఉపాధి కూలీలు చేస్తున్నారన్నారు. సకాలంలో వేతనాలు ఆన్‌లైన్ విధానంలో వారి ఖాతాలకు జమ అవుతున్నాయన్నారు.

40 షెడ్ల నిర్మాణం పూర్తి



రామారావుగూడెంలో నిర్మించిన మల్బరీ షెడ్డు

దెందులూరు: దెందులూరు మండలంలో 40 మల్బరీ షెడ్ల నిర్మాణం పూర్తయ్యాయని పట్టు పరిశ్రమల శాఖ దెందులూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ టి.రత్తయ్య అన్నారు. ఆదివారం రామారావుగూడెంలో నిర్మాణం పూర్తయిన సాగులో ఉన్న మల్బరీ షెడ్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నూరు శాతం సబ్సిడీతో మల్బరీ సాగుకు ఇస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం బాధాకరం



పోకల రాంబాబు

దెందులూరు: తాడేపల్లిలో నిర్మిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని హైకోర్టు ప్రొసిడింగ్స్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తెల్లవారుజామున జేసీబీలతో కూల్చివేయడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు, దెందులూరు నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు పోకల రాంబాబు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు వారాలు గడవక ముందే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రజలందరూ కూటమి ప్రభుత్వ చేష్టలను పరిశీలిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి కుట్రపూరిత రాజకీయాలకు కూటమి ప్రభుత్వం ఒడి కట్టకూడదని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ కమిటీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు అన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి వార్షికోత్సవం



ఉంగుటూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: ఉంగుటూరు తూర్పు కాలవ గట్టు వద్ద ఉన్న ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే పి.ధర్మరాజు సందర్శించుకుని పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా వచ్చిన ఆయనకు ఆలయ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. రామచంద్రపురంలో నీలాలమ్మ జాతరలో ధర్మరాజు పాల్గొని పూజలు చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త వట్టి పవన్ పాల్గొన్నారు. పూళ్ల సర్పంచి దాయం సుజాత, ప్రసాద్, ఉప సర్పంచి పెదిరెడ్డి హరిబ్రహ్మానాయుడు జనసేనలో చేరారు. ఆదివారం నారాయణపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వట్టి పవన్ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ధర్మరాజు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



పోతునూరు ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దెందులూరు: స్నేహానికి ఉన్న విలువ, సృష్టిలో మరి దేనికీ లేదని రిటైర్డ్ ఎమ్మెల్యో, పోతునూరు పాఠశాల ఉపాధ్యాయులు గద్దె అమరేశ్వరరావు అన్నారు. ఆదివారం పోతునూరు ఉన్నత పాఠశాలలో పోతునూరు ఉన్నత పాఠశాలలో 1992–93 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల క్రితం కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. తొలుత పూర్వ విద్యార్థులు నున్నా లక్ష్మణ్ బాబు, ఏ. నాగేశ్వరరావు, నాగనబోయిన శంకరరావు, అప్పారావు, రామారావు పాఠశాల ఉపాధ్యాయులను వేదికపైకి ఆహ్వానించారు. పూర్వ విద్యార్థులు ఒక్కొరు వచ్చి వారు ఏ రంగంలో స్థిర పడింది, కుటుంబ నేపథ్యం వివరించి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా మాట్లాడుతూ తమకు విద్యనేర్పిన పాఠశాలకు త్వరలో తమ వంతు సాయం అందిస్తామని వివరించారు. వారంతా బాల్య స్మృతులను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు గద్దె అమరేశ్వరరావు, ఎస్.రాజారమేష్, బెజవాడ శివకుమారి, సీహెచ్ రామ్‌కుమార్‌ను విద్యార్థులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నాగనబోయిన శంకరరావు, అటవీ శాఖ ఉద్యోగి అప్పారావు, విద్యుత్ శాఖ ఉద్యోగి రామారావును సహచర విద్యార్థులు అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యం



భీమడోలులో ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల నూతన కార్యవర్గం

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి నూతన అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులతో పాటు 9 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కేంద్ర కమిటీ చైర్మన్ అలపాటి నాగేశ్వరరావు, జిల్లా శాంతి రథాల కమిటి చైర్మన్ అప్పక రాంబాబు పాల్గొని ప్రసంగించారు. అనంతరం సూరప్పగూడెంకు చెందిన విద్యార్థి బలుసు రుక్మిణి శ్రీ దుర్గాపావనికి రూ.5వేలకు ఫీజు నిమిత్తం అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన పూళ్లకు చెందిన పులి లక్ష్మీ గాయత్రికి రూ.2వేలు, ద్వితీయ స్థానం పొందిన జీబీఎస్ఎస్ రాజేశ్వరికి రూ.1,500, తృతీయ స్థానం పొందిన గుండుగొలనుకు చెందిన జస్వంత్‌కు రూ.1,000 చొప్పున నగదును అందించారు. అనంతరం మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, కార్యదర్శిగా అల్లాడ ప్రసాదరావు, కోశాధికారిగా గోనుగుంట రమణశంకర్, ఉపాధ్యక్షుడిగా అడబాల శ్రీనివాసరావు, జాయింట్ కార్యదర్శి పున్నం గోపి, ఈసీ సభ్యులు సీహెచ్ రాజేష్, బంటు గణేష్, చిలపర్తి ఆదినారాయణ, రామిశుట్టి రామన్నలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు సూర్యనారాయణ, విద్యా కమిటీ డైరెక్టర్ దవులూరి ప్రభాకరరావు, జిల్లా ప్రతినిధి రామిశెట్టి గంగాధరరావు, పూర్వపు మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పులిచర్ల వెంకట కృష్ణారావు, గోనుగుంట రమణ, గంధం వెంకట్రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలు



గాలాయగూడెంలో చెత్త, తుప్పల తొలగింపు పనులను పరిశీలిస్తున్న నాయకులు



సానిగూడెంలో మురుగు తీయిస్తున్న సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు)

దెందులూరు: జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఆదివారం చివరి రోజు గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగాయి. పంచాయతీ సిబ్బంది బ్లేడ్ ట్రాక్టర్‌తో రోడ్డుకిరువైపులా మొక్కలు, చెత్త తొలగించి, చదును చేశారు. డ్రెయిన్లలో పూడిక తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేశారు. పారిశుధ్య పనులను గాలాయగూడెంలో జనసేన దెందులూరు మండల నాయకులు పెద్దిశెట్టి నాని, టీడీపీ నాయకులు పూజారి శ్రీనివాసరావు, ఏనుగు రామకృష్ణ, మండల ఈఓఆర్డీ మూర్తి పర్యవేక్షించారు.సానిగూడెంలో సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు), వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్, పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జేసీబీతో డ్రెయిన్‌లో మురుగును తీయించారు. వాటర్ ట్యాంకులో బ్లీచింగ్ చల్లించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు దేశానికే ఆదర్శం



ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్

భీమడోలు: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అన్నారు. భీమడోలులోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వారి బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విక్రమ్ కిషోర్ హాజరయ్యారు. నియోజకవర్గ కో కన్వీనర్ వెజ్జు ధర్మారావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మత్తే శ్రీనివాస శాస్త్రి, యువమోర్చా జిల్లా కార్యదర్శి మూర్తి, మండల కార్యదర్శి వర్ధినీడి కపిరాజు, నాయకులు పాల్గొన్నారు.

సక్షమ్ సేవలు అభినందనీయం



సక్షమ్ స్థాపన దినోత్సవంలో భాగంగా ప్రసంగిస్తున్న సీఐ బీబీ రవికుమార్, ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న సక్షమ్ సేవలు అభినందనీయమని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలులో సక్షమ్ సంస్థ ధ్వర్యంలో ఆదివారం సక్షమ్ స్థాపన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తూ సకలాంగులతో సమానంగా అన్నింటినీ అందిపుచ్చుకుంటున్నారన్నారు. అలాంటి దివ్యాంగులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తున్న సక్షమ్ సేవలను కొనియాడారు. దివ్యాంగులకు ప్రభుత్వ ప్రోత్సాహం తోడు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకుంటున్నాయన్నారు. వికలాంగత్వం శారీరానికేనని, మనస్సు కాదన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. దివ్యాంగులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. నేటి సమాజంలో ప్రజలు వికలాంగుల పట్ల ప్రేమానురాగాలు చూపుతున్నారన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆదుకుంటున్న, సేవలందిస్తున్న సక్షమ్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, సక్షం రాష్ట్ర సభ్యుడు సీహెచ్ జగన్నాథం, లయన్స్ క్లబ్ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు పీవీ సత్యనారాయణ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి పాల్గొన్నారు.

పల్లెలకు రక్షిత తాగునీరు

- నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు
- ట్యాంకుల శుభ్రతకు ప్రణాళిక





దెందులూరులోని ఓవర్‌హెడ్ ట్యాంక్, ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

దెందులూరు: పల్లె ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత మంచినీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో నీరు కలుషితం కాకుండా అవసరమైన పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మే నెలలో అకాల వర్షాలు కురడం, ఈ నెలలో నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్), గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ (జీఎల్ఎస్ఆర్)కు నీటిని సరఫరా చేసే మంచినీటి పైపుల లీక్ కావడంతో నీరు కలుషితమవుతోంది. లీక్ అయిన పైపులను సకాలంలో గుర్తించకపోవడం, వాటి నుంచి సరఫరా అయ్యే నీటినే తాగడం వల్ల ప్రజలు వాంతులు, విరేచనాలతో అనారోగ్యాలకు గురికావడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా పోతున్న సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఏ గ్రామంలో కూడా కలుషిత నీరు తాగి ప్రజలు పలు రకాల రోగాలకు గురికాకుండా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 547 గ్రామ పంచాయతీలుండగా ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీపీఓ యంత్రాంగానికి, సర్పంచులకు సర్క్యులర్ జారీ చేసింది.

గ్రామ పంచాయతీలు	574
ఓహెచ్ఎస్ఆర్	1,501
జీఎస్ఎల్ఆర్‌లు	151

చర్యలు ఇలా

- ప్రతి 15 రోజులకొకసారి ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్‌లను శుభ్రం చేయాలి. ఆయా ట్యాంకుల వద్ద శుభ్రం చేసిన తేదీ, తిరిగి శుభ్రం చేసే తేదీని తెలియజేయాల్సి ఉంది.
- ఎస్ఐఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం 20 లీటర్ల నీటికి 0.50 ఎంజీ క్లోరిన్ ట్యాబ్లెట్ కలపాల్సి ఉంది.
- తాగునీటిని సరఫరాచేసే పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాల్సి ఉంటుంది.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు



గ్రామీణప్రాంతాల్లో పారిశుద్యాన్ని పెంపొందించడంతో పాటు రక్షిత మంచినీటిని అందించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులపై ఎంతైనా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటిని అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. నీటి ట్యాంకులను శుభ్రం చేయించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తున్నాం. ఆయా ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేసే నీటిని క్లోరినేషన్ చేయిస్తున్నాం.

– తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా పంచాయతీ అధికారి

- గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్ స్టాక్ ఉంచుకోవాలి.
- క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న గ్రామీణ నీటి సరఫరాకు చెందిన ఇంజనీర్లు తమ పరిధిలోని నీటి పథకాలను తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటూ ఉండాలి.
- తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

పుస్తకం మనందరి నేస్తం కావాలి



భీమడోలులో చిన్నారులకు విద్యాంశాలు వివరిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకుంటారని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పాల్గొని చిన్నారులకు నైతిక విలువలతో కూడిన విద్య పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం చిన్నారులకు నీతి కథలు, పొడుపు కథలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక్ అంత్యక్రియలు

ఏలూరు రూరల్: శనివారం భద్రాచలం వద్ద గోదావరి నదిలో నీట మునిగి మృత్యువాత పడ్డ అంగుళూరి కార్తీక్ అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. శనివారం రాత్రి కుటుంబ సభ్యులు కార్తీక్ మృతదేహాన్ని ఏలూరులో మాదేపల్లి రోడ్డు ఇందిరా కాలనీలో పెద్దమ్మ ఇంటికి తీసుకొచ్చారు. కార్తీక్ 7వ తరగతి చదువుకుంటున్న మాదేపల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు పువ్వుల ఆంజనేయులు, తోటి విద్యార్థులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆడుతూ, పాడుతూ చలాకీగా ఉండే కార్తీక్ అకాలంగా మృత్యువాత పడడంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.